ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మిని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ట్రాఫిక్ ఏసీపీని ఆమె కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలోని కార్వాన్, జియాగూడ, కమెలా రోడ్డు, టోలిచౌకీ, లంగర్ హౌస్, నానల్‌నగర్ డివిజన్‌తో పాటు గోల్కొండ బంజారి దర్వాజా, ఫతేదర్వాజ వద్ద ట్రాఫిక్ పరిస్థితిని ఆమెకు వివరించారు. టోలిచౌకీ నుంచి గోల్కొండ కోట షేక్‌పేట్ వైపు వెళ్లే వాహనాలు టూంబ్స్ రోడ్డుపై జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుంటున్నాయన్నారు. ప్రధాన కూడళ్లు, గోల్కొండ కోట దర్వాజాల వద్ద విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బందికి అదనపు సిబ్బందిని కేటాయించాలని ఆయన ఏసీపీని కోరారు. కాగా ప్రతినిత్యం అన్ని ప్రాంతాల్లో ఒకే సమయంలో ట్రాఫిక్ జామ్ అవుతుందని దీని వల్ల సిబ్బందిని వెంట వెంటనే కూడళ్లకు మార్చడం కుదరడం లేదని ట్రాఫిక్ ఏసీపీ అన్నారు. రద్దీగా ఉండే వేళల్లో ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు అదనపు సిబ్బందిని నియమిస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

ఐసెట్ కన్వీనర్ అవినీతిపై విచారణ చేపట్టాలి



బాలకృష్ణారెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

నాంపల్లి: ఐసెట్–2024 కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ నరసింహాచారి అవినీతిపై విచారణ చేపట్టాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం మాసాబ్ ట్యాంక్‌లోని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.సుమంత్ మాట్లాడుతూ..ఐసెట్–2024 నిర్వహణ కోసం తెలంగాణ ఉన్నత విద్యా మండలి విడుదల చేసిన రూ.92.76 లక్షల్లో సుమారు రూ.30 లక్షలకు పైగా నిధులను ఎటువంటి నిబంధనలు పాటించకుండా అక్రమ పద్ధతిలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయమై ఇప్పటికే ఓ దినపత్రికలో వార్తలు ప్రచురితం అయ్యాయని, ప్రొఫెసర్ నరసింహాచారి నైతిక బాధ్యత వహించి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇతర సెట్‌ల నిర్వహణ తీరుపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు రుక్మాత్ పాషా, వెంకటేష్, శివ, పృథ్వి, పవన్, సమీర్, వేణు, ఇంతియాజ్, మన్మాత్, షరీఫ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పాండురంగారావుకు నివాళి

చాంద్రాయణగుట్ట: సీనియర్ కాంగ్రెస్ నేత ఎస్.పాండురంగారావు 23వ వర్ధంతి సందర్భంగా రాజన్నబావి సమీపంలోని రెయిన్‌బో అనాథ బాలికల ఆశ్రమంలో గురువారం ఆయన కుమారుడు, మిత్ర యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.పి.క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో బాలికలకు స్టీల్ గ్లాసులు, బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సాయి షిండే, వి.యజత్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు గ్లాసులు, బిస్కెట్లు అందజేస్తున్న ఎస్.పి.క్రాంతి కుమార్

చిత్రకారులను ఆదుకోవాలి



వెలుదండకు శుభాకాంక్షలు తెలుపుతున్న అనంతయ్య

నాంపల్లి: ప్రముఖ చిత్రకారుడు డి.అనంతయ్య నూతనంగా నియమితులైన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. అనంతరం చిత్రలేఖన విభాగం గురించి పలు అంశాలను ఉపాధ్యక్షుడు దృష్టికి తీసుకెళ్లారు. చిత్రకారులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అనంతయ్య మాట్లాడుతూ..తెలుగు భాషాప్రియుడు తెలుగు వర్సిటీకి ఉపాధ్యక్షుడిగా రావడం సంతోషాన్ని వ్యక్తం చేశారు.

పారదర్శకంగా ఈఓల పదోన్నతులు



మాట్లాడుతున్న ఈఓల సంఘం, అర్చక ఉద్యోగుల జేఏసీ నాయకులు

సుల్తాన్‌బజార్: దేవాదాయ ధర్మాదాయ శాఖలో ఈఓల పదోన్నతులు పారదర్శకంగా జరగలేదని ఓ వార్త పత్రిక కథనాన్ని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఈఓల సంఘం, తెలంగాణ దేవాదాయ అర్చక ఉద్యోగుల జేఏసీలు తీవ్రంగా ఖండించాయి. గురువారం బొగ్గులకుంటలోని దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీజీ ఈఓస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నరేందర్, రాజేష్‌కుమార్, అర్చక ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు కాండూరి కృష్ణమాచారి, జేఏసీ కన్వీనర్ పరశురామ్ రవీంద్రచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ అగ్నిహోత్ర చంద్రశేఖర శర్మ మాట్లాడారు. దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి పదోన్నతుల విషయమై గురువారం ఓ ప్రముఖ వార్త పత్రికలో దేవాలయ ఉద్యోగులను ప్రైవేటు ఉద్యోగులు అని రాయడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 150 మంది మాత్రమే ప్రభుత్వ ఉద్యోగులని 500 మంది ఆలయాల్లో పనిచేస్తున్నారు. 262 జీఓ ప్రకారం..కార్యనిర్వహణ అధికారులుగా పదోన్నతులు పొందడం చట్టం కల్పించిన హక్కు అన్నారు. చట్టంలో ఉన్న రూల్స్ ప్రకారమే.. ఈఓలుగా పదోన్నతులు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఈఓల సంఘం నాయకులు ఎం.శ్రీనివాస్‌రెడ్డి, అంజనారెడ్డిలతో పాటు జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ప్రదీప్

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో ప్రోత్సహించాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త ప్రదీప్ బన్సల్ అన్నారు. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న డీఆర్‌ఎస్ ఇంటర్నేషనల్ ఉన్నత పాఠశాల స్పోర్ట్స్ మీట్‌ను ఆయన గురువారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టేబుల్ టెన్నిస్ స్కేటింగ్, స్విమ్మింగ్‌లతో పాటు కరాటే పోటీలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. వివిధ విభాగాలకు చెందిన 138 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ఏకే.అగర్వాల్, సంజయ్ అగర్వాల్, గౌరవ్ అగర్వాల్‌లతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ అల్లంవెల్లుల్లి పేస్టు పట్టివేత

లంగర్‌హౌస్: నకిలీ అల్లం వెల్లుల్లి పేస్టు తయారుచేసి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అదనపు డీసీపీ అందె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..ఆసిఫ్‌నగర్‌లో నివాసముండే ఇమ్రాన్ సలీమ్(42) వ్యాపారస్తుడు. హీనా కంపెనీ పేరుతో నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో అల్లంవెల్లుల్లి పేస్టు విక్రయిస్తున్నాడు. నకిలీ అల్లంవెల్లుల్లి పేస్టు తయారుచేస్తూ విక్రయిస్తున్నాడని సమాచారం అందుకున్న సౌత్‌వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి లంగర్‌హౌస్ డిఫెన్స్ కాలనీలోని అతని గోదాంపై దాడి చేశారు. అక్కడ పరిశీలించగా ఎఫ్ఎస్ఎస్ఎఐ మార్గదర్శకాలు పాటించకుండా నకిలీ అల్లంవెల్లుల్లి పేస్టు విక్రయిస్తున్నట్లు నిర్ధారించారు. అతని వద్ద నుంచి రూ.4,45,380 విలువ చేసే 835.5 కిలోల అల్లంవెల్లుల్లి పేస్టును స్వాధీనం చేసుకున్నారు. సిట్రిక్ యాసిడ్, ఐరన్ ప్రెస్ మిషన్, ఎయిర్ గన్ మిషన్, గ్రైండర్ యంత్రాన్ని సీజ్ చేశారు. అనంతరం నిదితుడిని లంగర్‌హౌస్ పోలీసులకు అప్పగించారు. నిందితుడిపై 2011లో రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్, 2022లో తాండూరు పోలీస్‌స్టేషన్, 2023లో వికారాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయని తెలిపారు.

మూసీ బాధితులకు అండగా బీజేపీ



మూసీ బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

జియాగూడ: మూసీ బాధితులకు అండగా బీజేపీ ఉద్యమిస్తుందని బీజేపీ శాసన సభాపక్ష నేత, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామారావు అన్నారు. ఈ మేరకు గురువారం కార్వాన్ నియోజకవర్గంలోని జియాగూడ మూసీ పరీవాహక కేసరినగర్ ప్రాంతంలో బీజేపీ శాసనసభాపక్ష బృందం పర్యటించింది. అనంతరం వారు మాట్లాడుతూ..మూసీ ప్రాంత ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. 25న ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద జరిగే మహా ధర్నాకు బాధితులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి అమర్ సింగ్, గోల్కొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు గంజి రఘునాథ్, కార్వాన్ కన్వీనర్ కె.గోవర్ధన్, కార్వాన్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి డిజ్వర్ సింగ్, బీజేపీ సీనియర్ నాయకురాలు బండారి రాధిక, పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా ఉంటాం

దూద్‌బౌలి: మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి అన్నారు. బీజేపీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, గోల్కొండ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి టి.ఉమామహేంద్ర తదితరులతో కలిసి గురువారం ఆయన పురానాపూల్ తదితర మూసీ పరీవాహక బస్తీలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..1979 నుంచి ఇక్కడ ఇళ్ల స్థలాలు కొనుక్కుని ఇళ్లు నిర్మించుకున్న వారిని రోడ్డు పాలు చేస్తామంటే తమ పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. బీజేపీ నాయకులు ప్రవీణ్, మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, సురేందర్, ప్రవీణ్ బాగ్డీ, కునాల్‌రావు, ముఖేష్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి


నీటి బిల్లులు సకాలంలో చెల్లించాలి



డీజీఎం కబీర్

విజయనగర్‌కాలనీ: నీటి బకాయిదారుల ప్రయోజనార్థం ఓటీఎస్ (వన్ టైమ్ సెటిల్‌మెంట్) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు జల మండలి డీజీఎం కబీర్, ఆసిఫ్‌నగర్ సెక్షన్ మేనేజర్ జీవన్ తెలిపారు. బకాయిలు చెల్లించేందుకు ఈ నెల చివరి వరకు గడువు ఉందన్నారు. ఓటీఎస్‌ను వినియోగించుకునే వారికి పాత బకాయిలపై వడ్డీని మాఫీ చేసేందుకు వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'కాంగ్రెస్ పార్టీకి ప్రజాదరణ పెరుగుతోంది'



కురాకుల కృష్ణ

గోల్కొండ: కాంగ్రెస్ పార్టీకి రోజు రోజుకూ ప్రజాదరణ పెరుగుతుందని కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. తమ పార్టీకి లభిస్తున్న ప్రజాదరణను బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన అన్నారు. గత పదేళ్లల్లో రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బీజేపీ ఏనాడు నిలదీయలేదని నిరుద్యోగ సమస్యలపై కూడా గతంలో బీజేపీ పోరాడిన దాఖలాలు లేవని ఆయన అన్నారు. అయితే ఉద్యోగ నియామకాలు చేపడుతూ.. రైతుల ప్రయోజనాలను కూడా దృష్టిలో పెట్టుకొని సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీపై బీజేపీ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. మూసీ సుందరీకరణతో నగర ఖ్యాతి పెరుగుతుందని ఈ విషయాన్ని బీజేపీ నాయకులు సహించలేకపోతున్నారని అందుకే దీనిని అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు.

నిషేధిత పాన్ మసాలా, జర్దా తయారీ స్థావరంపై దాడి

ఇద్దరి అరెస్ట్

చాంద్రాయణగుట్ట: నిషేధిత పాన్ మసాలా, జర్దా, తంబాకులను తయారు చేసి విక్రయిస్తున్న ఇద్దరిని ఫలక్‌నుమా పోలీసులు అరెస్ట్ గురువారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం ..ఫలక్‌నుమా ఫాతిమానగర్‌కు చెందిన సయ్యద్ ఇమ్రాన్ (32), శాలిబండ ఖాజీపురా ప్రాంతానికి చెందిన మహ్మద్ జుబేర్ (29)లు కొంతకాలంగా తీగలకుంట రహమత్‌నగర్ అన్సారీ రోడ్డు ప్రాంతంలో నిషేధిత పాన్ మసాలా, గుట్కా, జర్దా, తంబాలకు తయారు చేస్తున్నారు. వీటిని స్థానికంగా ఉండే దుకాణాల్లో సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై విశ్వసనీయమైన సమాచారం అందుకున్న ఫలక్‌నుమా పోలీసులు తయారీ స్థావరంపై బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తయారీదారులు సయ్యద్ ఇమ్రాన్, మహ్మద్ జుబేర్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2.10 లక్షల విలువ చేసే పలు రకాల పేర్లతో ఉన్న పాన్ మసాలాలు, జర్దాలు, గుట్కాలు, తంబాకులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

రాజీవ్‌గాంధీ పేరు తొలగింపు!



నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రిలో రాజీవ్‌గాంధీ పేరు తొలగింపు విషయం తీవ్ర చర్చాంశనీయమైంది. గత ప్రభుత్వ హయాంలో కొందరు గుర్తు తెలియని ఉద్యోగులు తొలగించిన ఆసుపత్రి బోర్డును నేటికీ సరిచేయలేదు. 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నవజాత శిశు సంరక్షణ కోసం నిలోఫర్ ఆసుపత్రిలో 450 పడకల సామర్థ్యం కలిగిన ప్రత్యేక బ్లాక్‌ను నిర్మించారు. తదుపరి రోగుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ సామర్థ్యాన్ని వెయ్యి పడకలకు పెంచారు. ఈ బ్లాక్‌కు రాజీవ్ ఇంటెన్సివ్ కేర్ బ్లాక్‌గా నామకరణం చేస్తూ అప్పటి క్యాబినెట్‌లో తీర్మానం చేశారు. ఈ బ్లాక్ నిర్మాణం పనులు 2009లో ప్రారంభమై 2016లో ముగిశాయి. 2014లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడంతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిలోఫర్ ఆసుపత్రిలో రాజీవ్ ఇంటెన్సివ్ కేర్ బ్లాక్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం నిలోఫర్ ఆసుపత్రిలో మొత్తం 1300 పడకల సామర్థ్యం కలిగిన ఆసుపత్రిగా పేదలకు సేవలందిస్తోంది. అయితే నిలోఫర్ ఆసుపత్రికి ఏర్పాటు చేసిన రాజీవ్ ఇంటెన్సివ్ కేర్ బ్లాక్ బోర్డును కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. ఈ బోర్డును తొలగించి నెలలు గడుస్తున్నా కొత్త బోర్డును ఏర్పాటు చేయడంలో నిలోఫర్ అధికారులు సుముఖంగా లేరు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రి బోర్డును సరిచేయాలని స్థానికులు, రోగులు, రోగి సహాయకులు, వైద్యులు, వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. ఈ విషయమై నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రవికుమార్‌ను ఫోన్‌లో వివరణ కోరే ప్రయత్నం చేయగా స్పందించలేదు. ఆసుపత్రిలో కూడా ఆయనను కలిసే ప్రయత్నం చేయగా అందుబాటులో లేరు.

అలనాటి పాటలు ఎంతో మధురం



గన్‌ఫౌండ్రీ: అలనాటి పాటలు ఎంతో మధురమని శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో వంశీ ఆర్ట్స్ థియేటర్స్, శారద ఆకునూరి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సినీగేయ కవి మైలవరపు గోపీకి స్వర నీరాజనం పేరిట సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు ఆలపించిన గీతాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, కొరియోగ్రాఫర్ సుచిత్ర చంద్రబోస్, మైలవరపు వెంకన్న, సంస్థ వ్యవస్థాపకులు వంశీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న యువ నృత్య కళాకారిణి పాటిల్ వన్‌శిక యాదవ్

చార్మినార్: పాతబస్తీ బేలా చందులాల్ ప్రాంతానికి చెందిన యువ నృత్య కళాకారిణి పాటిల్ వన్‌శిక యాదవ్ తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌ల చేతుల మీదుగా ఉత్తమ నాట్య పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నగరంలో జరిగిన మహాత్మా గాంధీ, అంతర్జాతీయ అహింసా దినోత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా ఈ పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షులు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ నూనె విక్రయదారుడి అరెస్టు

నాంపల్లి: కృత్రిమ నూనెను విక్రయించే నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 15 కిలోల డాల్డాను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ ఘటన గురువారం హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుభాన్‌పురాలో చోటుచేసుకుంది. ఎస్సై మోనయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సుభాన్‌పురాకు చెందిన మహ్మద్ ఇబ్రహీం కుమారుడు మహ్మద్ ఫజల్ మదానీ అనే వ్యక్తి గత కొన్నాళ్లుగా జంతువుల కొవ్వుల ద్వారా తయారు చేసిన డాల్డాను విక్రయిస్తూ అక్రమ సంపాదనకు పాల్పడుతున్నాడు. గత కొన్నాళ్లుగా డాల్డాను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ నూనెను పలు హోటల్స్‌కు, రెస్టారెంట్లకు గుట్టుచప్పుడు కాకుండా సరఫరా చేస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సుభాన్‌పురాలోని అతడి ఇంటిపై దాడులు చేశారు. ఇంట్లో దాచిన 4 టిన్ల కృత్రిమ నూనెను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

భూమ శ్రీనివాసరావుకు ఎక్సలెన్సీ అవార్డు



అవార్డు అందుకుంటున్న భూమ శ్రీనివాసరావు

అబిడ్స్: పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లో విశేష ప్రతిభ కనబరిచిన భూమ శ్రీనివాసరావుకు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులు అవార్డు అందజేశారు. ఇండియన్ ఎక్సలెన్సీ అవార్డును అతని ప్రతిభను గుర్తించి అందించారు. డాక్టర్ నాగార్జునబాబు, డాక్టర్ పావని, డాక్టర్ అపూర్వ మధ్యల ఆయనకు అవార్డు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ అవార్డు లభించడం సంతోషకరంగా ఉందన్నారు. తన ప్రతిభను మరింత పెంపొందిస్తూ సమాజ సేవకు మరింత కృషి చేస్తానన్నారు.

వినియోగదారులకు అత్యుత్తమ సేవలందించడమే లక్ష్యం



డీఈకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించడమే తమ లక్ష్యమని టీజీఎస్‌పీడీసీఎల్ డీఈ సుధీర్ అన్నారు. రేతిబౌలి వద్ద గల కార్యాలయంలో నూతనంగా నియమితులైన డీఈ సుధీర్‌ను యూనియన్ నాయకులు కలిసి అభినందించారు. ఆయనను కలిసిన వారిలో డివిజన్ సెక్రటరీ సతీష్‌రెడ్డి, రామ్‌లాల్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ ఆషామ్ ఆలీ బేగ్ తదితరులున్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్న గుర్రం శివశంకర్

జియాగూడ: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం అని బీజేపీ జియాగూడ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు జియాగూడలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం జోరుగా కొనసాగింది. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు పార్టీ క్రియా శీలక సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత్వం పొందాలన్నారు.

'కుల గణనలో మేరు కులాన్ని ఒకే కులంగా పరిగణించాలి'



బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న మేరు సంఘం నేతలు

చార్మినార్: కుల గణనలో చేతి వృత్తి పని చేసుకునే మేరు కులస్తులను ఒకే కులంగా పరిగణించాలని రాష్ట్ర మేరు సంఘం నాయకులు తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌ను కలిసి కోరారు. ఈ మేరకు సంఘం అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ అదపా వెంకటేశ్వరరావుతో పాటు ప్రతినిధుల బృందం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం ట్రస్ట్ చైర్మన్ పాడిశెట్టి నర్సింగ్‌రావు, నాయకులు ఎస్‌బీ సంగేవార్, దీకొండ నర్సింగ్ రావు, కీర్తిరాజ్ గోపాల్, కె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మి ఆలయం వద్ద నిరంతర విద్యుత్ సరఫరాకు వినతి



డీఈతో సమావేశమైన ఆలయ ప్రతినిధులు

చార్మినార్: దీపావళిని పురస్కరించుకుని చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఉత్సవాల నిర్వాహకులు టీజీఎస్‌పీడీసీఎల్ డీఈ శ్రీధర్‌ను కోరారు. ఈ మేరకు ఉత్సవాల నిర్వాహకులు సూర్యప్రకాష్ ,సచిన్‌తో పాటు గణేష్ ఉత్సవ సమితి సెంట్రల్ కమిటీ సభ్యులు ప్యారసాని వెంకటేష్ తదితరుల బృందం విద్యుత్ అధికారులతో సమావేశమై దీపావళి పండుగకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని కోరారు. భాగ్యలక్ష్మి ఆలయ పరిసరాలలో తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈ శ్రీధరతో పాటు ఏడీఈ అక్బర్, ఏఈ రాజు తదితరులున్నారు.

ప్రత్యేక పూజలు



చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్, భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య గురువారం తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు ప్రముఖ వ్యాపార వేత్త బంకట్ లాల్ భాటీ తదితరులున్నారు.

27న ఉచిత లీగల్ ఎయిడ్ క్లీనిక్

నాంపల్లి: బజ్‌మే కక్షాన్ లిటరరీ అసోసియేషన్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, న్యాయవాది మహ్మద్ అసద్ అలీ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం నాంపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 27న మల్లేపల్లిలోని మహమూద్ ఆసుపత్రి సమీపంలోని మదీనా టవర్ మూడవ అంతస్తులో ఉచిత లీగల్ ఎయిడ్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు న్యాయనిపుణులు హాజరవుతున్నట్లు తెలిపారు. డైవర్స్, ఖులా, సర్వీస్ మ్యాటర్, ఆన్‌లైన్ ఫ్రాడ్ కేసులు, డోమెస్టిక్ వయోలెన్స్, చైల్డ్ కస్టడీ, ప్రాపర్టీ డిస్ప్యూట్, మెయింటెనెన్స్ వంటి కేసులపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అఫ్జల్‌సాగర్, మల్లేపల్లి, హబీబ్‌నగర్, నాంపల్లి, బజార్‌ఘాట్ ప్రాంతాల మురికివాడల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోషామహల్ నాలాకు కొత్తగా పైకప్ప నిర్మాణాలు చేపట్టాలి



సురేష్ ముదిరాజ్

అబిడ్స్: గోషామహల్ నాలాకు పైకప్పు నిర్మాణాలు కొత్తగా చేపట్టాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు సురేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. 40–50 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ నాలా అతి పురాతనంగా మారిందన్నారు. రెండు సంవత్సరాల్లో రెండు సార్లు పైకప్పు కూలడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్, ఇతర ఇంజినీరింగ్ అధికారులు వెంటనే నూతన నాలా పైకప్పు నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ప్రాణాంతకంగా మారిన ఈ నాలా పైకప్పులను కొత్తగా నిర్మిస్తే ప్రజలకు ఎంతో ప్రయోజనం ఉంటుందని సురేష్ ముదిరాజ్ అన్నారు.

నేడు జాబ్‌మేళా

విజయనగర్‌కాలనీ: ప్రైవేటు సంస్థలలోని వివిధ ఉద్యోగాల భర్తీకి నేడు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఉపాధి కార్యాలయం కల్యాణాధికారి జి.జయశ్రీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్సీ, ఐటీఐ, ఇంటర్మీడియేట్, ఏదైనా డిప్లొమా విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 30 ఏళ్లలోపు నిరుద్యోగ అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఫొటోలు, సర్టిఫికెట్లతో శుక్రవారం సికింద్రాబాద్ చంద్రలోక్ కాంప్లెక్స్‌లోని స్టాఫింగ్ టైటాన్స్ కార్యాలయంలో నిర్వహించే జాబ్‌మేళాకు నేరుగా హాజరుకావచ్చన్నారు.